
మామూలు మనుషుల్లా బ్రతకకుండా ఎవరికైనా ఉపయోగపడా లన్నది జగన్నాథం ఆదర్శం. ఆ ఆశయానికి ఆయన ఇచ్చిన రూపం ఏది?

# నారికేళం నా ఆదర్శం

ప్రఫుల్లచంద్ర



లోనికి అడుగు పెట్టబోయి గుమ్మం దగ్గరే ఆగిపోయింది రాధ.

'మరేం పర్వాలేదు. పద!' అన్నట్లు సైగ చేశాడు గోపాల్.

"ఆగు! లోనికి రావడానికి వీల్లేదు!" లోనుంచి అరిచిం దొక వృద్ధ స్వరం.

ముందుకు పడిన పాదాన్ని వెనక్కి లాక్కుని తల వంచుకొని అట్టే నిలబడి పోయింది రాధ.

గుమ్మం బయట యువజంట. లోపల వృద్ధజంట.

అటు ఆవేశం! ఇటు ఆచారం!

అటు ఆశ! ఇటు అమ్మ!

అటు పోరాడే వయస్సు! ఇటు ఆరాటపడే మనసు!

ఐదు నిమిషాలు పది యుగాల్లాగ గడిచాక- జగదాంబ ఇక నిగ్రహించుకోలేక రెండడుగులు ముందుకేసి- "ఒరే నికృష్టుడా! దౌర్భాగ్యుడా! ఎంతపని చేశావురా! ప్రేమించడానికి ఆ కులం తక్కువ అమ్మాయే దొరికిందా? మాకు చెప్పనైనా చెప్పకుండా గుట్టుచప్పుడు కాకుండా పెళ్ళి చేసుకొచ్చే శావురా?! ఎంత దగా. ఎంత మోసం! కన్న కొడుకే ఇంత మోసం చేస్తే..." అని అరుస్తూ గుమ్మం అవతల నిలబడిన కొడుకు చొక్కా పుచ్చుకొని ఊపేస్తోంది. తోసేస్తోంది- హిస్టీరియా వచ్చినట్లు.

భీత హరిణంలా ఆ తల్లి ఆర్భాటం చూస్తూ వణికిపోతున్న రాధ దృష్టి- గదిలోనికి ప్రసరించింది.

అంత దూరంలో- మామగారు. ఇట్టే ఆకర్షించే ప్రసన్న వదనం. కాంతులీనే కళ్ళు. విశాల ఫాలభాగాన ప్రశాంత రేఖల్లా విభూతి. తెల్లని పట్టు జుట్టు లోనుంచి తొంగి చూస్తున్న పచ్చ పచ్చని అక్షింతలు! తెల్లని గ్లాస్కో పంచె కట్టు. భుజం మీదుకు ఎర్రని శాలువా.

గుమ్మంలో జరుగుతున్న రభస చూసి ఇంటి చుట్టూ మూగుతున్న జనం చెవులు కొరుక్కుంటూ నవ్వుకుంటూ ఉంటే కంటగింపుగా, కంద కోతగా ఉంది రాధ పరిస్థితి. మామగారి దృష్టి తనపై పడగానే దైవాన్ని ప్రార్థిస్తున్నట్లు కళ్ళు మూసుకొని చేతులు జోడించింది.

"జగదీ! వాళ్ళని లోనికి రానియ్."

ఉరుములు, మెరుపుల మధ్య వేణునాదం లా మామగారి స్వరం వినిపించగానే కళ్ళు తెరిచింది రాధ.

అంతే! అత్తగారి ఉరుములు ఆగిపోయాయి గాని కంటి నుంచి కుండపోతగా వర్షం ప్రారంభం. "మన పరువూ, మర్యాద!" అని రోదిస్తూ గుమ్మం నుంచి అడ్డు తొలగింది.

అలా మామగారి వల్ల ఆ ఇంట్లో అడుగు పెట్టిన కోడలు రాధకు క్రమక్రమంగా పరిస్థితులు ఆకళింపు అవుతున్నాయి.

అత్తగారు తనతో మాట్లాడదు. తను వంటింటిలో అడుగు పెట్టడానికి వీల్లేదు. ఏ పనిలోనూ చెయ్యి పెట్టకూడదు. తన మానాన తను పడకగదిలో పడి ఉండాలి- భర్త వచ్చే వరకూ ఒంటరిగా. మధ్యాహ్నం ఎప్పుడో చడీ చప్పుడూ లేకుండా పళ్ళెంలో భోజనం గుమ్మం వద్ద పెట్టేసి వెళ్ళిపోతుంది అత్తగారు. తను ఆ పళ్ళాన్ని గదిలోకి తెచ్చుకొని తిని, పెరటి కుళాయి దగ్గర కడిగేసి మళ్ళీ గుమ్మం దగ్గర పెట్టేయాలి.

ఆ తర్వాత అత్తగారు కుళాయితో సహా తను తాకిన ప్రతి అంగుళం మేరా ముక్కుతూ,

### చిన్నారి కాపురం
### గతంలో

రాంబాబుతో వివాహానంతరం చిన్నారి కాపురానికి బయలుదేరే ముందు అమె మేనత్త ఉపదేశాన్ని వింటుంది. ఆ ఉపదేశం మేరకు భర్తను చిన్నారి కట్టడి చేస్తుంది. ఇంకేమి, రాంబాబు ఇల్లు దాటి చెట్టూ పుట్టా పట్టి చివరికి అన్నవరం చేరుకుంటాడు. అక్కడ తనబోటి వారితోనే పరివేష్టితుడై ఉన్న ఒక స్వామిని కలుసుకుని గోడు వెళ్ళబోసుకుంటాడు. అయన ద్వాపర, త్రేతాయుగాల్లోని ఆడ రాక్షసులంతా బ్రహ్మను కోరి ఇవుడు భార్యా బాధితుల భార్యలుగా జన్మ లెత్తారని చెబుతాడు. అక్కడివారంతా తమ తమ గాథలను చెప్ప నారంభిస్తారు.

మూలుగుతూ, నణుక్కుంటూ శుద్ధి చేసుకుంటుంది. ఖైదీ బ్రతుకు. దుర్భరం దుస్సహం!

కులాంతర వివాహం అంటే సమస్యలు తప్పవుగాని మరీ ఇంత ఘోరమా? భర్తకు చెప్పుకొని ఏడిస్తే- "నాన్నగారికి చెప్పు" అని చెప్పేసి కోర్టుకు వెళ్ళిపోతాడు లాయర్ గోపాల్.

మామగారు అద్భుత వ్యక్తి. శరీరం గుప్పెడు, మనసు మేరువు. పండిన తమలపాకు చాయ. విజ్ఞానం వెదజల్లే నిర్మల నయనాలు. పరుషవాక్కు ఎరుగని నోరు. పదవీ విరమణ తరువాత ఆయన జీవనసరళి పూర్తిగా మారిపోయింది.

పాంట్, షర్టులు పోయి పంచె, శాలువా. సదా భగవన్నామ సంకీర్తన. ఎంత చలి అయినా, ఉదయం ఐదుకే లేచి కీర్తనలు పాడుకుంటూ చన్నీటి స్నానం. తర్వాత కీర్తనలు పాడుతూనే పూలు కోసి తెచ్చుకుని పూజ గదిలోకి వెళ్తారు.

సరిగా ఏడు అయేసరికి గణ గణ ఘంటారావంతో పూజ ముగుస్తుంది. తర్వాత టిఫిన్- రెండు ఇడ్లీలు. చిన్న గ్లాసుతో పాలు.

మిగిలిన సమయ మంతా సద్గ్రంథ పఠనం తోనో, వ్యాస రచనతోనో గడిచిపోతుంది. ఆయన బయటకు వెళ్ళడం అరుదు. ఎవరెవరో ఆయన కోసమే వస్తూ ఉంటారు. అందరికీ గౌరవనీయుడు. ప్రేమ పాత్రుడూ. పురాణకాలం నాటి మహర్షి ఎవరో కాలం మరిచి, దారితప్పి తమ ఇంటికి వచ్చేసినట్లుగా అనిపిస్తూ ఉంటుంది రాధకు ఆయన్ని చూస్తే.

ఇలాంటి వారంతా చాదస్తపు పుట్టలు. సంప్రదాయాలు పట్టుకుని వేలాడుతూ గతంలోనే జీవిస్తారు. కాలంతో బాటు మారలేరు. ఈయనకు చెప్పుకుంటే ఒరిగే దేముంది? అనుకుంటూనే ఆయన గదిలోకి వెళ్ళి ఎదురుగా చాపమీద నిశ్శబ్దంగా కూర్చుంది.

ధ్యానపీఠం ఎదుట కూర్చుని ఏదో రాసుకుంటున్న జగన్నాథం కోడలి రాక గమనించి ఆశ్చర్యంగా భ్రుకుటి ముడిచారు.

రాధ మాట్లాడలేదు. తల వంచుకొని అలాగే ఉండిపోయింది.

"చెప్పమ్మా!" అన్నా డాయన ఆప్యాయంగా.

రాధ తల ఎత్తింది. "మరో జన్మలోనైనా మంచి కులంలో పుట్టి అత్తవారింట మన్ననలు పొందడానికి ఈ జన్మలో చేయాల్సిన పూజలూ, వ్రతాలూ ఏమైనా ఉన్నాయా మామగారూ?" సూటిగా అడిగింది.

జగన్నాథానికి సమస్య అర్థమై పోయింది.

కోడలు మామగారికి ఏం ఫిర్యాదు చేయబోతోందోనని గుమ్మం దగ్గరే తచ్చాడుతున్న జగదాంబను పిలిచి, "ఈ కులంలో పుట్టడానికి గత జన్మలో నీవు చేసిన పూజలేమైనా జ్ఞాపకం ఉన్నాయా జగదీ?" మృదువుగానే అడిగా రాయన.

జగదాంబ తల వాలిపోయింది.

"ఆనాడు శుచి శుభ్రతల కోసం, ఆరోగ్య సూత్రాలుగా ఆరంభమైన మడీ తడీ, అంటూ సొంటూ ఈనాడు చాదస్తంగా మారి మనుష్యుల మధ్య దూరాన్ని పెంచుతున్నాయి. చదువుకున్న కోడల్ని దూరంగా ఉంచడం సంస్కారం కాదు. సాటి స్త్రీని గౌరవించలేని నీకు గౌరవం పొందే అర్హత ఎక్కడిది?"

పదవీ విరమణ అయాక జగన్నాథం గొంతెత్తి గట్టిగా మాట్లాడింది లేదు. ఇప్పుడూ అంతే. అల్లరి పిల్లను మందలించే తండ్రిలా మృదువుగానే అయినా దృఢంగా అన్నా డాయన.

జగదాంబ కుంచించుకు పోయింది.

"స్నేహితుని ఇంట్లో ఉంటూ, ఆ స్నేహితుని భార్యనే అవమానించడం సంస్కారమా?" మెత్తగా అడిగా డాయన.

"స్నేహితుని ఇల్లా?"

చిన్నగా నవ్వుకుని- "మనం ఉంటున్న ఈ ఇల్లు నా స్వార్జితం కాదని నీకూ తెలుసుకదా! ఇది మా నాన్న గారిది. అందువల్ల చట్టప్రకారం ఇది మన అబ్బాయికి చెందుతుంది, మనకి కాదు. పెళ్ళయిన కొడుకుని స్నేహితుని లాగ చూసుకోవాలి గాని పసివాడిలా కాదు. నిజం చెప్పాలంటే మనం ఇప్పుడు స్నేహితుని ఇంట్లో ఉంటున్నాం. ఇక్కడి పరిస్థితి నచ్చకపోతే- బయటకు పోవలసింది కోడలు కాదు, మనం!" అన్నా రాయన.

జగదాంబ మరి తల ఎత్తలేక పోయింది.

ఆ మహానుభావుడికి చేతులెత్తి నమస్కరించింది రాధ.

* * *

పూజ గదిలో గంట రోజులా కాక నీరసంగా మోగింది. రాధ గబగబా వంటింట్లో నుంచి వచ్చి డైనింగ్ టేబుల్ మీద గాజుపళ్ళెం పెట్టింది. దానిలో రెండు ఇడ్లీలు, ఒక చెంచా ఉంచింది. చిన్న కప్పులో సాంబారు, మరో చిన్న ప్లేటులో కొబ్బరి చట్నీ వేసి- అన్నింటికీ మూతలు పెట్టి వంటింట్లోకి వెళ్ళిపోయింది. జగదాంబ గ్లాసుతో నీళ్ళు తెచ్చి ఆ పళ్ళెం పక్కన పెట్టి భర్త రాక కోసం నిరీక్షిస్తోంది.

ఒకటి, రెండు, అయిదు నిముషాలు గడిచినా ఆయన పూజ గదిలోంచి బయటకు రాలేదు.

ఈలోగా రాధ వంటింట్లోంచి అయిదు సార్లైనా డైనింగ్ టేబుల్ వైపు తొంగి చూసింది. జగదాంబ పదిసార్లైనా పచార్లు చేసింది. పూజ పూర్తి అయినా, ఎందుకనో ఆయ నింకా బయటకు రాలేదు.

అత్త ముఖంలో అసహనం. కోడలి ముఖంలో ఆత్రం.

టవల్ భుజాన వేసుకొని బాత్‌రూంలోకి వెళ్తున్న గోపాల్ అలవాటుగా డైనింగ్ రూంలోకి తొంగి చూసి, అక్కడ తండ్రి కనబడక పోవడంతో టక్కున ఆగి... తల్లివైపు ఓసారి చూసి నెమ్మదిగా బాత్‌రూం కి వెళ్ళిపోయాడు.

ఆ సమయంలో టిఫిన్ చేస్తూ ఉండాల్సిన జగన్నాథం ఇలా డైనింగ్ టేబుల్ దగ్గరకు రాలేదంటే, గ్రహాలు గతులు తప్పా యన్న మాటే! అందుకే అందరికీ అంత ఆశ్చర్యం, ఆత్రం!

సంగ తేమిటో తెలుసుకోడానికి జగదాంబ నిశ్శబ్దంగా పూజగదిలో అడుగు పెట్టింది.

కుందిలో కొడిగట్టి రెపరెప లాడుతున్న జ్యోతివైపు నిశ్చలంగా చూస్తూ కూర్చుని ఉన్నాడు జగన్నాథం. ఆ జ్యోతి రెపరెపల కనుగుణంగా మండపంలోని వేంకటేశ్వరస్వామి మీద చీకటి వెలుగులు పరుచుకుంటున్నాయి. అగరొత్తులు ఆరిపోయినా ఇంకా గదినిండా సువాసన అలముకునే ఉంది.

కుందిలో నెయ్యి వేసి, అగ్గిపుల్లతో వత్తిని కొద్దిగా ఎగదోసింది జగదాంబ.

"పూజ అయింది. తన కర్తవ్యం నెరవేర్చుకొని ఆరిపోతున్న జ్యోతికి ఇంకా ప్రాణం పోస్తా ఎందుకు?" అన్నారాయన చిన్నగా నవ్వుతూ.

ఆ స్వరంలో ఏదో విశేషార్థం స్ఫురించి జగదాంబ గుండె జల్లుమంది. "టిఫిన్ చల్లారిపోతోంది" అంది ఉలికిపాటు కప్పి పుచ్చుకుంటూ.

జగన్నాథం నెమ్మదిగా లేచి టేబుల్ దగ్గరకు వచ్చి కూర్చున్నాడు. రాధ హడావుడిగా వచ్చి టిఫిన్ మూతలు తీసింది.

ఒక ఇడ్లీ తీసి సాంబారు కప్పులో నానబెట్టి, రెండో ఇడ్లీ ముక్క తుంపి చట్నీలో మెదిపి నోటిలో వేసుకున్నా డాయన. మెత్తగా వెన్నలా గొంతులోకి జారిపోయింది.

"ఇడ్లీ చాలా బాగుం దమ్మా!" కోడల్ని మెచ్చుకున్నా డాయన.

రాధ వెలిగిపోతున్న ముఖంతో, పరుగు లాంటి నడకతో కిచెన్‌లోకి వెళ్ళి మరో రెండు ఇడ్లీలు తెచ్చి వేసేలోగానే ఆయన చెయ్యి కడిగేసుకున్నారు. అవసరానికి మించి తినేవాడు దొంగతో సమానం అని ఆయన సిద్ధాంతం.

తెచ్చిన ఇడ్లీలు మళ్ళీ లోపలే ఉంచేసి గుమ్మాన్ని ఆనుకొని, మామగారి గురించి ఆలోచిస్తూ ఉండిపోయింది రాధ.

ఈ రోజు అన్నీ వింతలే! టిఫిన్ కోసం ఆలస్యంగా రావడం ఒకటయితే, టిఫిన్ అయాక కొడుకు కోసం ఎదురు చూస్తూ కూర్చోవటం మరొకటి.

గోపాల్ స్నానం చేసి రాగానే "ఆ విషయం ఏమయింది బాబూ?" అని అడిగా డాయన.

## ముఖ్య గమనిక

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురణార్థం పంపే కథలు, కవితలు, కార్టూన్లు వగైరాలను ఇంతకు పూర్వం వలెనే క్రింద ఇచ్చిన హైదరాబాద్ చిరునామాకు పంపవలసిందిగా కోరుతున్నాము.

చిరునామా:
ఎడిటర్
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
ఎక్స్‌ప్రెస్ సెంటర్
హైదరాబాద్ - 500 029

హఠాత్తుగా కరెంట్ పోయినట్లు అందరి ముఖాల్లోని వెలుగూ ఆరిపోయింది.

రాధ భయం భయంగా గోపాల్ వైపు చూస్తే అతగాడేమో ఆత్రంగా తల్లివైపు చూశాడు. ఆమె ఆ ప్రశ్న విననట్లు ఎటో చూస్తోంది.

తల వంచుకొని జగన్నాథం నెమ్మదిగా అన్నాడు "ఇక వారం రోజులే!" అలా అంటూ నెమ్మదిగా లేచి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఆ గదిలో మిగిలిపోయిన ముగ్గురికీ ఊపిరి ఆడలేదు. తల ఎత్తుకోడానికి ధైర్యం చాల లేదు.

"ఇక వారం రోజులే!"

"లేదు లేదు, ఆయ నా మాట అనలేదు. నేనే పొరపాటుగా విన్నాను"- అని ఆ ముగ్గురూ ఎవరికి వారు మభ్య పెట్టుకుంటున్నారు.

జగన్నాథం గుర్తు చేసిన 'ఆ విషయం'...

గోపాల్ స్నేహితుడు నటరాజన్. అతగాడు మెడిసిన్ చదువుతున్నాడు. ఎప్పుడూ గలగలా మాట్లాడుతూ ఉంటాడు. జగన్నాథాన్ని కూడా వదలకుండా జోకులు గుప్పిస్తూ ఉంటాడు.

"అంకుల్! మా అనాటమీ తరగతికి శవాల కొరత! రూల్ ప్రకారం నలుగురు విద్యార్థులకి ఒక శవం చొప్పున ఇవ్వాలి కాని పదిమంది కొకటి కూడా ఇవ్వలేకపోతున్నారు. నేను గవర్నమెంట్ డాక్టర్‌ని అయాక శవాల కొరత తీరుస్తాను గాని. ఈలోగా ఎలా? పాలివ్వని ఆవుల్ని కబేళాకు తోలేసినట్టు, పనీపాటూ చేయలేని ముసలోళ్ళని అనాటమీ థియేటర్‌కి తోలెయ్యాలి" అన్నాడొకసారి- తన జోక్‌కి తనే నవ్వేస్తూ.

అయితే జగన్నాథం నవ్వలేదు. తర్వాత ఆయనలో 'ఇదీ' అని స్పష్టంగా చెప్పలేని ఏదో మార్పు కలిగింది. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్టు కనిపించేవాడు. ఎప్పుడూ బయటకు వెళ్ళని ఆయన ఓరోజు బయటకు వెళ్ళి, తిరిగొచ్చాక మరింత గంభీరంగా మారిపోయాడు. ఆయన బాధ ఏమిటో అడిగి తెలుసుకునే ధైర్యం ఎవరికీ లేదు. రెండు రోజులు గడిచాక గోపాల్ కూడా గంభీరంగా మారిపోయాడు. పలకడు.

ఇంక భరించలేక జగదాంబ కొడుకుని నిలదీసి ఏడ్చేసింది.

అప్పుడు చెప్పాడు గోపాల్. రాధ నిర్ఘాంతపోయింది.

జగదాంబ హృదయంలో ఏదో మూల సన్నని వణుకు ప్రారంభమై, క్షణాల్లో విజృంభించి, నేలకూలి వెక్కి వెక్కి రోదించడం మొదలు పెట్టింది.

ఎప్పుడొచ్చాడో జగన్నాథం అంతా చూశాడు. భార్యను నెమ్మదిగా లేవదీసి కుర్చీలో కూర్చోబెట్టాడు. "జగదీ! ఎందు కా రోదన? పుట్టిన ప్రతి జీవీ మరణించక తప్పదు- కొంచెం ముందు వెనుకలు అంతే! మరణం తథ్యం అని తెలిశాక ఏడుస్తూ సమయం వృధా చేయడం అవివేకం. ధైర్యంగా ఎదుర్కోవాలి. వీలైతే ఇతరులకు ప్రయోజనం కలిగేటట్టు మన మరణాన్ని మలుచుకోవాలి."

ఆయన మాట్లాడుతుంటే వినడమే తప్ప ప్రశ్నించే సాహసం ఎవరూ చేయరు. ఆయన వ్యక్తిత్వం అలాంటిది. ప్రశ్నకు ఆస్కారం ఇవ్వని వాక్పటిమ ఆయనది.

అందర్నీ కూర్చుండమని తనూ కూర్చుని అన్నాడు. "నా మరణాన్ని ప్రయోజనకరంగా మలచుకోడానికే మొన్న మెడికల్ ఆఫీసర్ గార్ని కలిశాను. మరణానంతరం నా శరీరాన్ని అనాటమీ థియేటర్‌కి విరాళంగా ఇవ్వాలను కుంటున్నాను అని చెప్పాను. కాని అలా తీసుకునే అధికారం తనకు లేదని అనేశా డాయన."

తన వాళ్ళు తన మాటలకు ఎలా స్పందిస్తున్నారో అంచనా వేయడానికి అందరి వైపూ దృష్టి సారించాడు జగన్నాథం.

అందరూ తలలు వంచుకునే ఉన్నారు. జగదాంబ వణికిపోతోంది. లోలోనే కుమిలిపోతున్నట్లు తెలుస్తూనే ఉంది. ఆమె భుజం మీద చెయ్యివేసి అనునయంగా అన్నాడు జగన్నాథం. "జగదీ! వాతావరణం కలుషితం కారాదని మృతదేహాన్ని ఖననం చేస్తారు, లేదా దహనం చేస్తారు. అంతేతప్ప ఉత్తర క్రియలు ఘనంగా జరిపితే సద్గతి కలుగుతుం దనుకోవడం ఉత్త సెంటిమెంట్ మాత్రమే. నా దేహం కాబోయే డాక్టర్లకు ఉపయోగపడితే నేను సంతోషిస్తా. నా ఆత్మ శాంతిస్తుంది. నాకు ఉత్తరక్రియలు అక్కరలేదు."

అందరూ తలలు వంచుకునే ఉన్నారు. జగదాంబ వణికిపోతూ ఉంది.

'బాబూ, గోపాల్! నా కో చిన్న సాయం చెయ్యి నాయనా! నా దేహాన్ని స్వాధీనం చేసుకొని అనాటమీకి ఉపయోగించ వలసిందిగా, మెడికల్ ఆఫీసర్‌ని ఆదేశించవలసిందిగా కోరుతూ హైకోర్టులో రిట్ దాఖలు చేయాలి. ఆ ఏర్పాట్లు చూడు బాబూ!" అంటూ చటుక్కున లేచి చరచరా తన గదిలోకి వెళ్ళిపోయాడు జగన్నాథం.

అక్కడ మిగిలిన ముగ్గురూ ఉలిక్కిపడ్డారు. ముగ్గురి కళ్ళూ వర్షిస్తున్నాయి. ముగ్గురి హృదయాలూ రోదిస్తున్నాయి- మౌనంగా, హృదయ విదారకంగా.

* * *

ఇందాక- గోపాల్ స్నానం చేసి రాగానే "ఆ విషయం ఏమయింది బాబూ?" అని ఆయన అడిగింది- ఆ రిట్ విషయమే.

"ఇక వారం రోజులే!" అనడంలో ఆయన ఉద్దేశ్యం వాళ్ళకి అర్థం కాకపోలేదు.

జగదాంబకు కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. రాధ, గోపాల్ నెమ్మదిగా పడకగదిలోకి జారుకున్నారు. అక్కడ చెప్పాడు గోపాల్- 'నెలరోజుల క్రితం వేసిన రిట్‌పైన జడ్జిగా రిచ్చిన

MANAGEMENT DIPLOMA
CORRESPONDENT COURSES

Business | Taxation | Personnel
Hospital | Hotel | Marketing
Labour | Production | Materials
SSI Management | Banking | General Law
Accountancy | Finance | Sales
Sanskrit | French | Beautician

SSLC/Graduates eligible Duration : Six Months

For free prospectus write to :
Programme Co-ordinator
Indiana Academy of Management Sciences
Post Box : 1108, 1083 Mettupalayam Road
COIMBATORE - 641 002 Tamil Nadu

తీర్పు గురించి.

"అనాటమీ కోసం దిక్కూ మొక్కూలేని అనాథ ప్రేతాలను తీసుకోవచ్చుగాని, ఎవరైనా విరాళంగా తన దేహాన్నిస్తా నంటే తీసుకునే వీలు లేదు. అయితే జడ్జిగారు మన విషయంలో ఒక రాయితీ ఇచ్చారు. మెడికల్ ఆఫీసర్ స్వయంగా మృతదేహాన్ని స్వాధీనం చేసుకునే వీల్లేదు కాని, మనం తీసుకువెళ్ళి అప్పగిస్తే ఆయన స్వీకరించవచ్చు." అదీ తీర్పు సారాంశం.

ఆ తీర్పు వారం క్రితమే వెలువడింది. దాని కాపీ రెండురోజుల క్రితమే గోపాల్‌కీ, మెడికల్ ఆఫీసర్‌కీ అందాయి.

ఆ తీర్పు విని ఆ పరిస్థితిలోనూ రాధకు నవ్వొచ్చింది. ఎడమ చేయి కాదు, పుర్రచెయ్యి అన్నట్లు అదేం తీర్పు?

'ధర్మం సూక్ష్మం నీ కర్థం కాదులే' అన్నట్లు భార్యవైపు చూసి, "ఆ రోజు అంటే, ఆ రోజు ఆచారం ప్రకారం కర్మలు జరపవలసిందేనని బంధువు లొకవైపూ దేహం నాకు అప్పగించ వలసిందేనని మెడికల్ ఆఫీసర్ ఒకవైపూ ఘర్షణకు దిగితే మన పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించు! ఈ తీర్పు వల్ల మెడికల్ ఆఫీసర్ మన ఇంటిమీద పడి యాగీ చేసే అవకాశం లేదు. పైగా అప్పటి పరిస్థితిని బట్టి మనం దేహాన్ని ఆయనకు అప్పగించకుండా దహనం చేయడానికీ వీలుంది" అని వివరించాడు.

దేహాన్ని అప్పగించనక్కరలే దన్న మాట ఊరట కలిగించినా, మరుక్షణమే రాధ ముఖం గంభీరంగా మారిపోయింది.

వారం రోజులే... ఇక ఒక్క వారం రోజులే!

* * *

సరిగా ఏడో రోజున-

మత విశ్వాసాన్ని కాదని, ఆచారాన్ని కాలదన్ని-తనకు కర్మలు చేయనక్కర లేదని ప్రకటించి, తన శరీరాన్నే విరాళంగా ఇవ్వజూపిన ఆ మహాత్ముని దర్శించు కోవాలన్ని మెడికల్ ఆఫీసర్ వచ్చాడు.

మూర్తీభవించిన బ్రహ్మ స్వరూపంలా వ్యాసపీఠం ముందు కూర్చున్న ఆయన్ని చూడగానే సాష్టాంగ పడా లనిపించింది. కాని ఎదురుగా చాపమీద కూర్చుని తనని పరిచయం చేసుకున్నాడు.

"పావురాన్ని రక్షించడానికని తన శరీరం కోసి డేగకు ఆహారంగా పెట్టిన శిబిచక్రవర్తి కథ విన్నాం. ఆయన నిజంగా అలా చేశాడో, లేదోగాని అంతకంటే గొప్పవారైన మిమ్మల్ని చూసే అదృష్టం కలిగింది" అన్నాడు ఆరాధన ధ్వనించే స్వరంతో.

ఆ పొగడ్త విని జగన్నాథం సిగ్గు పడిపోయాడు. "వద్దండీ! అంతటి మహాత్ములతో నన్ను పోల్చకండి. నా మట్టుకు నాకు కొబ్బరిచెట్టు ఆదర్శం" అన్నారు.

నీడనిచ్చే వటవృక్షం, పవిత్రమైన తులసి లాంటివి కాక కొబ్బరిచెట్టు ఆదర్శమా అని ఆశ్చర్యపోయాడు ఆఫీసర్.

"ఒక మనిషి మరో మనిషికి ఉపయోగపడినా, పడకపోయినా వృక్షాలు మాత్రం మనిషి కెంతగానో ఉపయోగపడుతున్నాయి. అయితే వృక్షాలలో కొన్ని భాగాలు మాత్రమే ఉపయోగపడతాయి. కొబ్బరిచెట్టు విషయం అలాకాదు. ఆ వృక్షం కాండంతో బాటు ఆకులు, ఆకుల్లోని ఈనెలూ-కాయలు సరేసరి. ఆ కాయలోని నీరు, కాయపైనున్న పెంకు, కాయ చుట్టూ వున్న పీచు-కొబ్బరి చెట్టులో మనిషికి పనికిరాని భాగమంటూ ఏదీ లేదు. అందుకే నారికేళం నా ఆదర్శం. నారికేళం లాగా నాలోని ప్రతి అణువూ మానవాళికి ఉపయోగపడాలి అని నా ఆశ. నా కోరిక మరోటి ఉంది. ప్రతి మనిషీ నారికేళ వృక్షంలా ఇతరులకు ఉపయోగపడాలి. నారికేళంలా జీవించాలి. నారికేళం లాగా..."

అంతే! ఆయన ఆ మాట పూర్తి చేయలేదు.


ముఖంలో ప్రశాంతి అలాగే ఉంది.

కళ్ళలో కాంతి అలాగే నిలచి ఉంది.

మానవాళికి ఏదో సందేశ మిస్తున్నట్టు, ఆయన నోరు మాత్రం సగం తెరుచుకుని అలాగే ఉండిపోయింది.★




1. ఫ్రాన్స్ దేశ చరిత్రలోనే గత మే నెలలో మొదటిసారిగా ప్రధానమంత్రి పదవిని చేపట్టిన మహిళ ఎవరు?
2. యుగోస్లేవియాతో సంబంధాలు తెంచుకొని స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్న రెండు రిపబ్లిక్‌ల పేర్లేమిటి?
3. 'ఆసియా అభివృద్ధి బాంక్'లో ఇటీవల సభ్యత్వాన్ని పొందిన మొదటి పశ్చిమ ఆసియా దేశం ఏది?
4. శరద్ పవార్ కేంద్రంలో రక్షణ శాఖ మంత్రి పదవిని చేపట్టడంతో ఆయన స్థానంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవి ఎవరిని వరించింది?
5. 'అస్సాం, హర్యానా, కేరళ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పాండిచ్చేరి'ల్లో ఇటీవల జరిగిన శాసన సభల్లో కనిపించిన సారూప్యం ఏమిటి?
6. భారత నూతన వైమానిక దళాధిపతి ఎవరు?
7. సార్క్ '1992' సంవత్సరాన్ని ఏ సంవత్సరంగా పాటించనుంది?
8. గతంలో 'డచ్ ఈస్ట్ ఇండియా'గా పేరొందిన దేశాన్ని ప్రస్తుతం ఏ పేరుతో పిలుస్తున్నారు?
9. అరువందల సంవత్సరాల తరువాత బద్ధలై మూడు వందలకు పైగా ప్రాణాలను బలిగొన్న ఫిలిప్పైన్స్ అగ్నిపర్వతం పేరేమిటి?
10. పదవ లోక్ సభకు జరిగిన ఎన్నికల్లో గెలిచిన సభ్యుల్లో అతి తక్కువ వయసు కలిగిన కింది ఫోటోలోని మహిళను గుర్తుపట్టగలరా?



11. మన దేశ మంతటికీ పెద్ద రాష్ట్రం అయిన ఉత్తరప్రదేశ్ ప్రస్తుత ముఖ్యమంత్రి ఎవరు?
12. చంద్రుని కాంతి భూమిని చేరడానికి ఎంత సమయం పడుతుంది?

**జవాబులు**

1. శ్రీమతి ఎడిత్ క్రేసన్ [ఫ్రాన్స్ అధ్యక్షుడు మైఖేల్ రొకార్డ్‌ను తొలగించి ఆయన స్థానంలో 57 ఏళ్ళ క్రేసన్‌ను నియమించారు.]
2. స్లొవేనియా, క్రోషియా [క్రోషియా రిపబ్లిక్‌కు చెందిన స్టిప్ మెసిక్‌ను యుగోస్లేవియా అధ్యక్షుణ్ణి చేసినప్పటికీ సంక్షోభం ముగిసిపోలేదు].
3. టర్కీ [గత ఏప్రిల్ 23న ఎ.డి.బి.లో 51వ దేశంగా చేరింది].
4. సుధాకర్‌రావు నాయక్ [పవార్ మంత్రివర్గంలో సభ్యుడుగా ఉన్న నాయక్ మహారాష్ట్రకు 17వ ముఖ్యమంత్రి].
5. పై వాటికి ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో ఏ ఒక్క రాష్ట్రంలోనూ అంతకు ముందున్న ప్రభుత్వం అధికారంలోకి రాకుండా, అన్ని రాష్ట్రాల్లోనూ నూతన ప్రభుత్వాలు ఏర్పడ్డాయి.
6. ఎయిర్ మార్షల్ ఎన్.సి. సూరి. [ఎస్.కె. మెహ్రా స్థానంలో నియమితు లయ్యారు.]
7. పర్యావరణ సంవత్సరంగా.
8. ఇండోనేషియా
9. 'మౌంట్ పినటుబో' [దీని నుంచి వెలువడిన బూడిద, శకలాలు సమీపంలో ఉన్న అమెరికా వైమానిక కేంద్రం మీద పడి శాశ్వతంగా మూసివేతకు దారి తీసింది].
10. కుమారి శైలజ. [మాజీ కేంద్ర సహాయ మంత్రి స్వర్గీయ దల్బీర్ సింగ్ కుమార్తె అయిన శైలజ తన 28వ ఏటనే హర్యానా రాష్ట్రంలోని సిర్సా రిజర్వ్‌డ్ స్థానం నుంచి లోక్ సభకు ఎన్నికయ్యారు.]
11. కల్యాణ్ సింగ్
12. 1.3 సెకండ్లు.

గార్లపాటి శ్రీనివాస్